

సమావేశంలో మాట్లాడుతున్న దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, వేదికపై దఫేదార్ రాజు, ముజీబుద్దీన్, గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, జాజాల సురేందర్, సుమిత్రానంద్

# నాటి ఉద్యమస్ఫూర్తితో 'దీక్షాదివస్'



- కేసీఆర్ త్యాగాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- త్వరలో కామారెడ్డిలో భారీ బహిరంగసభ
- సన్నాహక సమావేశంలో కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

కామారెడ్డి, నవంబర్ 26 : తెలంగాణ ఉద్యమ స్మృతులను గుర్తు చేసుకునేలా, కేసీఆర్ త్యాగాలను ప్రజలకు తెలిసేలా ఈ నెల 29 దీక్షా దివస్ నిర్వహించనున్నట్లు కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలో ఉదయం 11 గంటలకు అమరవీరులకు నివాళులు అర్పిస్తామన్నారు. దీక్షా దివస్‌లో పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దీక్షా దివస్ నేపథ్యంలో కామారెడ్డి పట్టణ శివారులోని ఓ ఫంక్షన్‌హాలులో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తోపాటు మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్ షిండే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున కెరటంలా లేచిందని గుర్తుచేశారు. కేసీఆర్ తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా 'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో' అని ఉద్యమించారన్నారు. తెలంగాణను తెచ్చిన కేసీఆర్ త్యాగాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు.

## కుట్రలను తిప్పికొడతాం..

బీఆర్‌ఎస్ నుంచి ఒకరిద్దరు వెళ్లిపోయినంత మాత్రాన పార్టీకి వచ్చిన నష్టమేమీలేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ కుట్రలను తిప్పికొట్టడానికి బీఆర్‌ఎస్ సిద్ధంగా ఉందన్నారు. త్వరలో కామారెడ్డి పట్టణంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, బీఆర్‌ఎస్ నాయకుడు ఎంజీ వేణుగోపాల్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



### కేసీఆర్ త్యాగాల వల్లే ప్రత్యేక తెలంగాణ

"ఉద్యమ నేత, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ త్యాగంవల్లే ప్రత్యేక తెలంగాణ వచ్చింది. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన త్యాగాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉన్నది. ఉద్యమ పార్టీ అయిన బీఆర్‌ఎస్ కేసీఆర్ నేతృత్వంలో గడిచిన పదేండ్ల కాలంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ ఎంతో అభివృద్ధి చేసింది. దీక్షా దివస్‌ను పెద్ద ఎత్తున నిర్వహిస్తాం. పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలి. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలి.

- గంప గోవర్ధన్,
కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే



### పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి

"కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తితో దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించాలి. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీశ్రేణులు తరలిరావాలి. తెలంగాణ కోసం కేసీఆర్ చేసిన త్యాగాలను ప్రజలకు వివరించాలి. ఉద్యమ జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకోవాల్సిన అవసరం ఉన్నది.

- హన్మంత్ షిండే,
జుక్కల్ మాజీ ఎమ్మెల్యే



### ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

"ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన ఉద్యమం యావత్ తెలంగాణను ఒక్కతాటిపైకి తెచ్చింది. తన ప్రాణాలను ఫణంగా పెట్టి తెలంగాణ కోసం కొట్లాడారు. ఆయన ఉద్యమ స్ఫూర్తితో దీక్షా దివస్‌లో పాల్గొని తెలంగాణ తల్లికి ప్రణమిల్లుదాం. దీక్షా దివస్‌లో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేద్దాం

- జాజాల సురేందర్,
ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే



### ప్రజల్లో ఉద్యమస్ఫూర్తిని రగిలిస్తాం..

"బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాం. ఇందుకోసం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నాం. తెలంగాణపై కేసీఆర్ చెరగని ముద్రవేశారు. ఆనాటి ఉద్యమాన్ని గుర్తుచేసుకుంటూ, ఉద్యమస్ఫూర్తిని ప్రజల్లో రగిలిస్తాం.

ముజీబుద్దీన్,
బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు



లింగంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఇంకుడుగుంత నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

# మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

- ఆసక్తి ఉన్న రంగాలను ఎంచుకోవాలి
- లింగంపేటలో మహిళా సంఘాల సమావేశంలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

లింగంపేట/ నిజాంసాగర్, నవంబర్ 26: స్వయం సహాయక సంఘాల మహిళలు అనుభవం, ఆసక్తి ఉన్న రంగాలను ఎంచుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం ఆయన లింగంపేట సెర్ప్ కార్యాలయంలో నిర్వహించిన మండల సమాఖ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నదని, వారిని ప్రోత్సహించడానికి రుణాలను కూడా అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే దుస్తులను కుట్టే బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించినట్లు చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతు పనులను కూడా వారికే ఇచ్చినట్లు తెలిపారు. మండలంలోని ఐదు గ్రామాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు. అంతకుముందు కలెక్టర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. తహసీల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఆవరణలో వీటి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో సురేందర్, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో నరేశ్, ఏపీఎం చామంతి శ్రీనివాస్, ఏపీవో భిక్షపతి, ఎంపీవో మల్హరీ, మండల సమాఖ్య అధ్యక్షురాలు సులోచనతో పాటు ఆయా గ్రామ సంఘాల అధ్యక్షులు, సీసీలు పాల్గొన్నారు.

### రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి

నిజాంసాగర్ మండలంలోని నవోదయ పాఠశాలలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించగా.. కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం విద్యాలయంలో సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీని కలెక్టర్ పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాలయంలోని గ్రంథాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖాధికారి శ్రీపతి, డీపీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీవో గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న న్యాయవాదులు

# రెచ్చిపోతున్న ల్యాండ్‌మాఫియా

- న్యాయవాదిపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి
- బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాస్తారోకో

వినాయక్‌నగర్, నవంబర్ 26 : నగరానికి చెందిన న్యాయవాది ఖాసీంపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి, శిక్షించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం ఆందోళన చేపట్టారు. జిల్లాకేంద్రంలోని కోర్టు చౌరస్తా, ధర్నా చౌక్ వద్ద మానవహారం నిర్మించి, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. నగరంలో ల్యాండ్ మాఫియా రెచ్చిపోతున్నదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగుతున్నదన్నారు. గూండా రాజ్యమేలుతున్నదన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టి శాంతిభద్రతలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖాసీంపై దాడి చేసిన దుండగులను అరెస్టు చేసే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి న్యాయవాదుల వద్దకు వచ్చి నిందితులను అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిల్ మెంబర్ రాజేందర్ రెడ్డి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు వసంతరావు, రాజు, సురేశ్, శ్రీకాంత్, అయూబ్, పరుచూరి శ్రీధర్, భాస్కర్, వెంకటేశ్, మాణిక్ రాజు, ఆశ నారాయణ, రవీందర్, జైపాల్, కవితారెడ్డి, అంజలి, కావ్య, అఖిల, ప్రవీణ, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాలో ఏడు మండల పరిషత్‌లు

**ఉత్తర్వులు జారీ జారీ చేసిన ప్రభుత్వం**

బోధన్/ నందిపేట్, నవంబర్ 26 : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఏడు కొత్త మండల ప్రజా పరిషత్‌లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలనా సౌలభ్యం కోసం కేసీఆర్ హయాంలో జిల్లాల పునర్విభజన చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కొత్త పంచాయతీలు, మండలాలు, డివిజన్లు, జిల్లాలను ఏర్పాటు చేసిన విషయం విదితమే. అయితే, మండలాలు ఏర్పడి, పాలన వికేంద్రీకరణ జరిగినప్పటికీ మండల ప్రజాపరిషత్‌లు ఏర్పాటు కాలేదు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్న దృష్ట్యా ప్రభుత్వం మండల ప్రజా పరిషత్‌ల ఏర్పాటుకు ముందడుగు వేసింది. 2019లో మండల పరిషత్ ఎన్నికలు పూర్తయిన తర్వాత సాలూర, పోతంగల్ మండలాలు ఏర్పాటుచేయాలని ఆయా మండలాల ప్రజలు కోరడంతో స్పందించిన నాటి సీఎం కేసీఆర్ కొత్త మండలాలను ఏర్పాటుచేశారు. ఆయా మండల కేంద్రాల్లో రెవెన్యూ కార్యాలయాలను ఏర్పాటుచేయడంతో ప్రజలకు పాలన చేరువైంది. సాంకేతిక కారణాలతో అప్పట్లో మండల పరిషత్‌లను ఏర్పాటుచేయలేదు. మేలో మండల పరిషత్ పాలకవర్గాల కాల పరిమితి ముగిసింది.

### మండల పరిషత్‌ల వివరాలు ..

నిజామాబాద్ జిల్లాలో ఆలూర్ (10 గ్రామాలు), డొంకేశ్వర్ (13 గ్రామాలు), సాలూరా (12 గ్రామాలు), పోతంగల్ (15 గ్రామాలు), కామారెడ్డి జిల్లాలో పాల్వంచ (12 గ్రామాలు), డోంగ్లి (13 గ్రామాలు), మహ్మద్‌నగర్ (13 గ్రామాలు) మండల ప్రజాపరిషత్‌లను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



రెంజల్ మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు.. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీని భేటీ అయిన వారిలో మండలంలోని తాడ్‌బిలోలి మాజీ సర్పంచ్ డాక్టర్ తెలంగాణ శంకర్, కాశం సాయిలు, తిరుపతి, రాము, తారాచంద్, ఎడపల్లి మండల నాయకులు శేఖర్, రాజు ఉన్నారు.

–రెంజల్, నవంబర్ 26

# పాల కేంద్రం ముట్టడి



ధర్పల్లి మండలకేంద్రంలోని డెయిరీ ఎదుట పాలు పారబోస్తూ నిరసన తెలుపుతున్న నిర్వాహకులు, పాడి రైతులు

- ధర్పల్లిలో పాడి రైతులు, నిర్వాహకుల ఆందోళన
- సెంటర్ ఎదుట పాలు పారబోసి నిరసన
- మూడు నెలలుగా అందని బిల్లులు
- విజయ డెయిరీ సూపర్‌వైజర్ నిలదీత

ధర్పల్లి, నవంబర్ 26 : మూడు నెలలుగా పేరుకుపోయిన బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ధర్పల్లిలో పాడి రైతులు, విజయ డెయిరీ నిర్వాహకులు ఆందోళన చేపట్టారు. మంగళవారం మండల కేంద్రంలోని విజయ డెయిరీకి చెందిన పాల శీతల కేంద్రాన్ని ముట్టడించారు.సేకరించిన పాలను కేంద్రం ఎదుట పారబోస్తూ నిరసన వ్యక్తం చేశారు. ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయి, డిచ్‌పల్లి తదితర మండలాల్లో విజయ డెయిరీ ఆధ్వర్యంలో 43 పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సమయానికి బిల్లులు రాకపోవడంతో ఆయా గ్రామాల్లోని పాడి రైతులు నిలదీస్తుండడంతో డెయిరీ నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ధర్పల్లిలోని కేంద్రానికి వచ్చిన విజయ డెయిరీ సూపర్‌వైజర్ బ్రహ్మానందంను నిర్వాహకులతోపాటు పాడి రైతులు నిలదీశారు. గత సెప్టెంబర్ నుంచి సుమారు రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు బిల్లు రావడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్రం ఎదుట పాల డబ్బాలతో ఆందోళన చేపట్టి సేకరించిన పాలను పారబోసి నిరసన వ్యక్తం చేశారు. దీంతో సూపర్‌వైజర్ వెంటనే డీఎంకు ఫోన్‌చేసి పరిస్థితిని వివరించగా.. వారం రోజుల్లోగా బిల్లులు చెల్లిస్తామని భరోసా ఇచ్చారు. వారం రోజుల్లోగా చెల్లించకుంటే పాడి రైతులతో కలిసి ఆందోళన మరింత ఉధృతం చేస్తామని నిర్వాహకులు హెచ్చరించారు.

### పదేండ్లుగా ఆగని బిల్లులు

గడిచిన పదేండ్ల కాలంలో ఎప్పుడూ ఇంతపెద్ద మొత్తంలో పాల బిల్లులు నిలిపివేయలేదని కేంద్రాల నిర్వాహకులు, పాడి రైతులు తెలిపారు. మూడు నెలలుగా బిల్లులు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బిల్లులు సకాలంలో అందజేయాలని, లేకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని, కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేస్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, పాడి రైతులు సంజీవ్, రాజారెడ్డి, లింగం, గణేశ్, నరేందర్, శేఖర్, మానస, శ్రీకాంత్, సాయిలు, సుభాష్, రవీందర్, పవన్, సుదర్శన్, సత్యనారాయణ, గంగాధర్, దాసు, రవి తదితరులు పాల్గొన్నారు.



జుక్కల్ మండలంలోని గుల్లా తండాలో తాగునీటి కోసం ఖాళీ బిందెలతో క్యూలో నిల్చున్న గ్రామస్తులు

# గుల్లతండాలో తాగునీటి కటకట

- వారం రోజులుగా నిలిచిన నీటి సరఫరా
- ఇబ్బందుల్లో గ్రామస్తులు

బిచ్కుంద, నవంబర్ 26: జుక్కల్ మండలంలోని గుల్లతండాలో తాగునీటి కటకట ఏర్పడింది. వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని బోరు కొన్ని నెలల క్రితం పాడైపోవడం, వారం రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో గ్రామశివారులో ఉన్న బోరును ఆశ్రయిస్తున్నారు. ఉన్న ఆ ఒక్కబోరు వద్ద గ్రామస్తులు మంగళవారం క్యూ కట్టాల్సిన దుస్థితి నెలకొన్నది. తాగునీటి సమస్యలపై పంచాయతీ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, లేకపోతే మండలకేంద్రంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. తాగునీటి ఇబ్బందులపై మిషన్ భగీరథ డీఈ కౌశిక్‌ను వివరణ కోరగా.. పైప్‌లైన్‌లో లీకేజీలు ఏర్పడడంతో ఐదురోజులుగా నీటి సరఫరా నిలిచిపోయినట్లు తెలిపారు. బుధవారం పనులు పూర్తిచేసి తాగునీటిని సరఫరా చేస్తామన్నారు.